ఆమె కదిలే సాహిత్యం

సాహిత్య రంగంలో ఆణిముత్యం 'పద్మజ'







పద్మజ రచించిన నవలలు, కవితల పుస్తకాలు

ఎన్నో అవార్డులు.. మరెన్నో పురస్కారాలు

చిన్ననాటి నుంచే రచనలు

సాహిత్యంపై ఆకాంక్ష ఉండాలి గాని ప్రావీణ్యత సాధించడానికి ఏది అడ్డంకి కాదు అని నిరూపించారు డాక్టర్ దేవులపల్లి పద్మజ. విశాఖ స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఏజీఎం దేవులపల్లి రామశాస్త్రి సతీమణి పద్మజ సాహిత్యంపై మక్కువతో చిన్ననాటి నుంచి ఎన్నో కవితలు రాశారు. 8వ తరగతి చదువుతున్నప్పుడు 'మువ్వన్నెల జెండా'పై తొలి కవిత రాయగా.. 13వ ఏట అలా ప్రారంభమైన సాహిత్య ప్రస్థానం ఎన్నో సన్మానాలు, సత్కారాలు, సాహితీ సభల్లో భాగస్వామ్యానికి దారి తీసింది. 6వ ఏటా భగవద్గీత పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. ఎం.కాం, ఎంఏ తెలుగు పూర్తి చేసిన ఆమె సంస్కృత భాషలో పీహెచ్‌డీ చేశారు. ప్రస్తుతం ఆమె గోపాలపట్నంలోని ఏయూ అనుబంధ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. – ఉక్కునగరం

వివిధ సామాజిక అంశాల ఇతివృత్తంగా 2008లో రాసిన 'మల్లెలు' కవితా సంకలనాన్ని ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. 2013లో 'ప్రకృతి పలుకుల్లో లోక రీతుల' పేరుతో వచనా సాహిత్య శతకం రాసి సాహితీవేత్తలను అబ్బురపరిచారు. 108 పద్యాలను సామాన్యులకు అర్థమయ్యేరీతిలో అందించారు. సంస్కృత వ్యాకరణ సంబంధిత 'కృష్ణ శతకం', 'విష్ణుసహస్ర నామ సంపుటి', 'నాటి కలలే – నేటి కన్నీళ్లా' అంటూ స్వాతంత్ర్యానికి ముందు, వెనుక పరిస్థితులపై విశ్లేషణాత్మక రచనలు చేసి ఔరా అనిపించుకున్నారు. 2005లో కేంద్ర సాహిత్య అకాడమీ వారు రూ. 10 వేలు ప్రోత్సాహక బహుమతితో సత్కరించారు. స్కూల్ స్థాయిలో జాతీయస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. ఆ తరువాత సాహిత్యంపై తన మార్కు చూపిస్తున్నారు. పదిహేనేళ్లుగా సంస్కృత శిక్షణా కేంద్రాన్ని నడుపుతున్నారు. సాహిత్యంలో వివిధ ప్రక్రియలు, కథ, కవిత, పద్యం, వ్యాసం, గేయం, సమీక్ష, గొలుసు కట్టు నవలలో భాగస్వామ్యం, సీరియల్స్‌కు రచనలు, ప్రముఖ పత్రికల్లో పద్మజ సాహిత్యం ప్రచురితమయ్యాయి. ఏడాదికి వందకు పైనే రచనలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రసారమవుతున్న భాగవత సుధ సీరియల్‌కు ఆమె రచనాసహకారం అందించారు.

పురస్కారాలు

గీర్వాణ ఘన సేవిక ఆధ్వర్యంలో ఉత్తమ రచయిత్రిగా జాతీయ పురస్కారం సాహిత్య అకాడమి, బెంగుళూరు వారిచే నగదు పురస్కారం, వాసవి కన్యకా పరమేశ్వరి ట్రస్ట్, హైదరాబాద్ వారి నగదు పురస్కారం, విశ్వసాహితీ, హైదరాబాద్ వారి ఉగాది పురస్కారం,



పద్మజను సత్కరిస్తున్న ప్రముఖ కవి సినారే (ఫైల్)

గీతా చారిటబుల్ ట్రస్టు, విజయనగరం వారి ఉగాది పురస్కారం, జనతాఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారం, సాహితి సంస్కృతిక సమాఖ్య, విజయవాడ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, కర్ణాటక తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పురస్కారం, ఏపీ కల్చరల్ సొసైటీ, విశాఖ ఆధ్వర్యంలో బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఏపీ, సాలూరు, విశాఖ సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు, కర్ణాటక రయితల సమాఖ్య ఆధ్వర్యంలో, ఉక్కు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం, గణపతిరాజు అచ్యుతరాజు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో జీవిత సాఫల్య పురస్కారం, మనిషి–మాను కవితకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు లండన్ వారి నుంచి అవార్డు అందుకున్నారు. ఈ నెల 21న విజయవాడ..శ్రీకళావేదిక ప్రతిభ సాహిత్యపురస్కారం అందజేయనుంది.

పద్మజ రచనలు

- శ్రీమానస – కథల సంపుటి
- మల్లెలు – కవితల సంపుటి
- శ్రీకృష్ణ మనోహరం
- రామాయణంలో మహర్షులు
- ప్రకృతి పలుకుల్లో లోకరీతులు
- వ్యాస సాహితీ .. 3 భాగాలు
- శ్రీహరి నామావళి
- నాటి కలలే – నేటి కన్నీళ్లా
- సుభాషిత భాస్కరం ద్విశతకం
- మంజుష .. లఘు నవల
- గణేశ గీతాలు (ముద్రణలో)
- సంస్కృత వ్యాకరణ సంకలనం
- సౌగంధి .... కవితల సంపుటి
- మహనీయులపై వ్యాసాలు

విదేశీ వేదికపై తెలుగు గళం

విదేశీ వేదికలపై దేవులపల్లి పద్మజ తెలుగు గళం వినిపించారు. ఖతార్‌లోని దోహా పట్టణంలో వంగూరి ఫౌండేషన్, ఆంధ్ర కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో జానపద గేయ సాహిత్యంపై ప్రసంగించి ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు నిర్వాహకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

ప్రసంగాలు.. పరిశోధనా పత్రాలు

పద్మజ ఆకాశవాణి విశాఖ, హైదరాబాద్ కేంద్రాల దారా ఇప్పటి వరకు తెలుగు, సంస్కృత భాషల్లో 60 వరకు రేడియో ప్రసంగాలు ఇచ్చారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, సంస్కృత భాషల్లో ఆమె 400కు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించారు.

అవధానాల్లో..

సంస్కృత, తెలుగు అవధానాలలో సుమారు 40 వరకు పృచ్ఛకత్వం వహించారు.



సినారే ప్రోత్సాహంతోనే..

తాత సూర్యనారాయణ శాస్త్రి రచయిత, ద్విభాషా పండితులు. ఆయన వద్ద చిన్నతనంలో సంస్కృతంలో శిక్షణ పొందా. అదే విధంగా జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సి.నారాయణ రెడ్డి (సినారే), కళాప్రపూర్ణ పోతుకూచి సాంబశివరావు చిన్ననాటి నుంచి ఇచ్చిన ప్రోత్సాహం వల్ల నేను ఈ స్థాయికి చేరుకోగలిగా.. నా సాహిత్య అభివృద్ధిలో వారే కీలకమైన వ్యక్తులు.

– డాక్టర్ దేవులపల్లి పద్మజ

వైజాగ్ విండ్ బాల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



జెర్సీలను ఆవిష్కరిస్తున్న కురందాస్ వంశీకృష్ణ యాదవ్

పెదగంట్యాడ: క్రీడల్లో ఆసక్తి పెంచేందుకు విండ్ పోటీలు దోహదం చేస్తాయని ఐఎన్‌టీయూసీ కాంట్రాక్ట్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కురందాస్ వంశీకృష్ణ యాదవ్ అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని సీతానగరం స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న వైజాగ్ విండ్ బాల్ ప్రీమియర్ లీగ్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ నెల 12 వరకూ జరగనున్న పోటీల్లో మొత్తం 12 జట్లు పాల్గొంటున్నాయని, ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.75వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50వేలు బహుమతులను అందజేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో నక్క వెంకటరమణ, మొల్లి చిన్న, నంబారు సింహాద్రి, చట్టి వెంకటేష్, మొల్లి నూకరాజు, మొల్లి రాజు, నక్క సింహాచలం పాల్గొన్నారు.

భవిష్యత్‌కు మార్గదర్శి ఐవోటీ



సీడీఏసీ జేసీ కుమార్‌ను సత్కరిస్తున్న విజ్ఞాన్ అధ్యాపకులు

అగనంపూడి: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ భవిష్యత్‌కు మార్గదర్శిగా నిలుస్తుందని సెంటర్ ఫర్ డెవెలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటరింగ్ (సీడీఏసీ) జాయింట్ డైరెక్టర్ ఎం.కుమార్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్ అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఐవోటీ భవిష్యత్ ఆవశ్యకత, దాని ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూధనరావు, ఈసీఎం డీన్ యు ఉమామహేశ్వరి, 6వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు



ప్రసన్న వేంకటేశ్వరాలయంలో భక్తులు ప్రవేశించేందుకు సిద్ధమైన ఉత్తరద్వారం

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయం వైకుంఠ ఏకాదశి (ఉత్తరద్వార దర్శనం)కి సిద్ధమైంది. ఉత్తరద్వారం ప్రవేశాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి మరో మార్గమైన నడక దారిని కూడా సిద్ధం చేశారు. వృద్ధులు నడకదారిలో నేరుగా ఆలయంలోకి చేరుకునే సౌలభ్యం కలుగుతుంది.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గాజువాక : ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. వందేభారత్ బ్లడ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 150 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రదీప్ కుమార్ ప్రారంభించారు. రక్తదానం చేసి వారికి ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి వినోద్‌బాలు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీను, ఆర్.వి.ఆర్.పాత్రుడు, క్యాంపస్ ఇన్‌చార్జి నర్సింహమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవోలు తిరుపతి రావు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రహదారి



భెల్ టౌన్ షిప్ నుంచి తుంగ్లాంకు వెళ్లే మార్గంలో రాళ్లు తేలిన మార్గం

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం నుంచి భెల్ (హెచ్‌పీవీపీ) టౌన్ షిప్ గేటు పక్క నుంచి సిగ్నల్ పాయింట్‌కు వెళ్లే మార్గం శిథిలావస్థకు చేరింది. రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా రాళ్లు తేలి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చెరువు వైపు గల భెల్ సంస్థ గేటు ఉంది. రాకపోకలు సాగించడానికి సంస్థ చిన్న గేటు నుంచి సుమారు 200 మీటర్ల మేర రోడ్డు మాత్రం పూర్తిగా రాళ్లు తేలి ఉంది. నడవటానికి, వాహనాలు వెళ్లేందుకు అసౌకర్యంగా ఉంది. గ్రామం నుంచే కాక సమీప ప్రాంతాలకు చెందిన పలువురు ఆటోనగర్ వంటి ప్రాంతాకు దగ్గరి మార్గంగా భెల్ సిగ్నల్ పాయింట్ నుంచి ఈ మార్గంను ఆశ్రయిస్తుంటారు. రోడ్డు శిథిలావస్థకు చేరడంతో అధికారులు స్పందించి మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్రాంతి సెలవులు అమలు చేయాల్సిందే

విశాఖ విద్య : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు ఈ నెల 10 నుంచి 19 వరకు సంక్రాంతి సెలవులు పక్కగా అమలు చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఇప్పటికే సెలవులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు గురువారం తెలిపారు. ఈ సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట కొన్ని యాజమాన్యాలు ఇప్పటికే ఒత్తిడి తెస్తున్నట్లు ఆధారాలతోపాటు తమ కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఏ యాజమాన్యానికీ మినహాయింపులు లేవన్నారు.

మోదీ, బాబు, పవన్ కల్యాణ్ తీరుపై

నల్ల జెండాలతో సీపీఎం నిరసన



పాతగాజువాకలో నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక : విశాఖలో బుధవారం నిర్వహించిన సభలో విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాకపోవడంపై సీపీఎం గాజువాక జోన్ నాయకులు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పి.మణి మాట్లాడుతూ విశాఖ జిల్లాలో రెండు లక్షల కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టుల కోసం శంకుస్థాపన చేసిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తెలుగు ప్రజల త్యాగఫలమైన విశాఖ ఉక్కు కోసం కనీసం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ తమను గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుతామని ఎన్నికలకు ముందు మాట్లాడిన పవన్ కల్యాణ్, చంద్రబాబు గెలిచిన తరువాత పట్టించుకోవడంలేదన్నారు. ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు కోసం నిరాహారదీక్ష చేసిన పల్లా శ్రీనివాసరావు కూడా ప్రధానమంత్రి సభలో నోరు విప్పకపోవడం అన్యాయమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడంతోపాటు ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎ.లోకేష్, కె.సంతోషం, కామేశ్వరి, గొలగాని అప్పారావు, శ్రీదేవి, పి.లక్ష్మణస్వామి, రాజేంద్రప్రసాద్, కె.సుబ్బన్న, జె.శ్రీలక్ష్మి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్షలు



కైలాసగిరి పోలీస్ మైదానంలో అభ్యర్థులకు సూచనలిస్తున్న అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా

ఆరిలోవ : కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో చేపడుతున్న కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఎనిమిదో రోజు శరీర దారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు 600 మందికి 304 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 237 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించినట్లు అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ పరీక్షలను ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు, అనకాపల్లి సబ్ డివిజినల్ డీఎస్పీ ఎం.శ్రావణి, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి పాల్గొన్నారు.

ఆంధ్రులంటే ప్రధానికి చులకన

అగనంపూడి: ఆంధ్ర రాష్ట్రమన్నా, తెలుగు ప్రజలన్నా ప్రధాన మంత్రి మోదీకి ఎలాంటి అభిప్రాయం ఉందో విశాఖ సభతో అర్థమైందని విశాఖ ఉక్కు సిటూ నాయకులు యు.రామస్వామి, ఎన్.రామారావు ఆరోపించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవంతో సమానమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో మాట్లాడకపోవడంతో దురదృష్టకరమన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో 1,428వ రోజు రిలే దీక్షా శిబిరంలో సీటూ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన విధానాలను చకచకా అమలు చేసుకుపోతోందని, దీన్ని వల్ల భవిష్యత్ పెట్టుబడిదారి వర్గం, సామాన్య వర్గాల మధ్య తారతమ్యాలు అంతరాలు పెరిగిపోయి దోపిడీకి తావుతీస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై మోదీ విశాఖ సభలో సానుకూల ప్రకటన చేస్తారని, ఈ విషయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చొరవ తీసుకుంటారని అంతా భావించామని, కాని దీనికి భిన్నంగా స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడడపోవడంతో నిరాశకు గురిచేసిందన్నారు. ఇదిలావుండగా నిరసన దీక్షలో పాల్గొకుండా ఉక్కు యాజమాన్యం ఆంక్షలు విధిస్తోందని, సెలవులు కూడా వినియోగించుకోకుండా నియంత్రిస్తుండడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.గంగాధర్, డీఎస్ఆర్‌సీ మూర్తి, పుల్లారావు, ఆర్.వెంకటరావు, బి.దుర్గాప్రసాద్, సత్యారావు, ఎర్రయ్య, జగ్గారావు, శ్రీనివాస్, సన్యాసిరావు, దత్తాత్రేయ రాజు, శ్రీనివాస్‌రెడ్డి, సూరిబాబు, అప్పలరాజు, అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిటూ నాయకులు రామారావు

ఇట్స్ ఏ బ్లాక్ బాస్టర్ పొంగలూ..



దానబోయినపాలెం పాఠశాలలో భోగి మంటల చుట్టూ నృత్యం చేస్తున్న బాలలు



డాలీ ప్లేస్కూల్‌లో సంక్రాంతి బాలల సందడి



లిటిల్ స్టార్స్ ప్రీ స్కూల్‌లో పిల్లల సందడి



రవీంద్ర భారతి స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



ఉక్కు డీఏవీ పాఠశాలలో ..



ఉక్కు డీఏవీ పాఠశాలలో రంగవల్లులు వేస్తూ..



గంగవరం యూపీహెచ్‌సీలో..



సిద్ధేశ్వరంలోని యూపీహెచ్‌సీలో...

అగనంపూడి: దానబోయినపాలెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో భోగీ మంటలు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, ఎరుకుల వేషధారణల, చెరుకుగెడలు, పాలపొంగులతో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో యలమంచిలి చిన అప్పారావు, మరడాన శ్రీలేఖ, సుజాత, లీల, బొర్రమ్మ, శీరంశెట్టి బాబ్జి, ఈగల పోలినాయుడు పాల్గొన్నారు. కణితి కాళింగ వీధిలోని డాలీ ప్లే పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ మాధురీ, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, సుధా పాల్గొన్నారు. అగనంపూడిలోని లిటిల్ స్టార్స్ ప్రీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎన్.భాను ప్రారంభించారు.

పాఠశాలల్లో సంక్రాంతులు

గాజువాక : రవీంద్ర భారతి స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గొబ్బెమ్మలు, భోగి పళ్లు, భోగిమంటలు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఆర్.కవిత తదితరులు పాల్గొన్నారు. స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భోగిమంటలు, హరిదాసులు, చిన్నారుల నృత్యాలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ కుమారి సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో రీజినల్ ఇన్‌చార్జి రమణ, ఏజీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

పెదగంట్యాడ: పలు పాఠశాలతో పాటు, సిద్ధేశ్వర్యంలోని యూపీహెచ్‌సీ, గంగవరంలోని యూపీహెచ్‌సీలో గురువారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. పెన్ స్కూల్లో అధినేత అనిత పెరార ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సిద్ధేశ్వర్యంలోని యూపీహెచ్‌సీలో వైద్యాధికారి మానస ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

ఉక్కునగరంలో..

ఉక్కునగరం: డీఏవీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. చిన్నారులు వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు. భోగిమంటలు, బొమ్మల కొలువు, భోగిపళ్లు, గొబ్బెమ్మలు, కోడిపందాలు మొదలైన వాటిని దృశ్యరూపకంగా రూపొందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుగంధా కుమారి పాల్గొన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే ముఖ్య అతిథిగా హాజరై వార్షిక మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పలువురు పాల్గొన్నారు.



ఉక్కు డీపీఎస్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

ముగ్గుల పోటీ

అక్కిరెడ్డిపాలెం: సంక్రాంతి పండగను పురస్కరించుకొని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థినులు 60 మంది ముగ్గులు వేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం తదితరులు పాల్గొన్నారు.